# గుడ్‌బై మై ఫ్రెండ్

సంధ్యారుణ కాంతిలో ఎఱ్ఱగా కనబడుతూంది సముద్రపునీరు. ఎగసి పడుతూ గట్టునందుకోవాలని ముందుకు చొచ్చుకువస్తున్న అలలు అంతలో తిరిగి పోతున్నాయి. దూరంగా ఇసకలో బంతి ఆట ఆడుతున్నారు. నలుగురు పిల్లలు. గాలికి జుత్తురేగి ముఖం మీద పడుతుండగా విసుగ్గా వాచివంక చూసుకుని దూరానికి దృష్టి సారించాడు మురళి. "ఇంకా రాదేం చెప్మా సుజాత! స్వగతంలా అనుకున్నాడు. తెల్లని పాంట్‌మీద నీలి టెర్లిన్ షర్ట్ టక్ చేసాడతను పచ్చని శరీరచ్ఛాయ. పొడుగైన విగ్రహం, చురుకుదనం తొంగిచూసే చక్కని కనులు, ఎదుటివారిని ఇట్టే ఆకర్షిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మురళి అందగాడు. అందుకే అప్సరసవంటి కన్య సుజాత తొలి చూపులోనే అతన్ని ఆరాధించసాగింది.

మురళి ఇంజనీరింగ్ కాలేజిలో లెక్చరర్‌గా చేస్తున్న పాతికేళ్ళ బ్రహ్మచారి. ఇంజనీరింగ్ కాలేజిలో అమ్మాయిలు లేరుగాని ఉంటే అందమూ చదువూ గల మురళి వాళ్ళ పాలిటి హీరో అయ్యేవాడు నెల్లాళ్ళ క్రిందట ఈ బీచ్‌లోనే సుజాతతో ప్రప్రథమంగా పరిచయం కలిగింది మురళికి. ఆరోజు ఒక్కడూ కూర్చుని ఇసుకను గుప్పిళ్ళలో పోస్తూ దూరంగా సముద్రంలోకి దిగిపోతున్న సూర్యుడివంక చూస్తూ ఆలోచిస్తున్న మురళి చేతిలో ఏవో కాగితాలు పెన్సిలు పట్టుకుని వయ్యారంగా నడుస్తూ వచ్చి తనకు పది గజాల దూరంలో కూర్చున్న అమ్మాయి వైపు అప్రయత్నంగానే చూసాడు నడక అందంగా ఉందనుకున్న మురళి ఆవిడను బాగా చూసాక అంత అందమైన ఆడపిల్లను తానింత వరకు చూడలేదన్న నిశ్చయానికి వచ్చేసాడు. చుట్టూ పరిసరాల్ని మరచిపోయి ఆమెవైపే చూస్తూ కూర్చుండిపోయాడు చాల సేపటివరకు. ఆ అమ్మాయి మాత్రం అతన్ని గమనించట్లేదు. మధ్య మధ్య తలెత్తి చూస్తో కాగితాలమీద ఏదో గీస్తోంది. బహుశ స్కెచ్ వేసుకుంటుందేమో ననుకున్నాడు మురళి. కాసేపటికి చీకటి పడతుండగా ఆ అమ్మాయి కాగితాలు బొత్తి పెట్టుకుని

వెళ్ళడానికి లేచింది. ఆ పిల్ల కాస్త దూరంగా వెళ్లాక ఆమె కూర్చున్న చోట్లో పడివున్న హాండ్‌బ్యాగ్‌ను చూసాడు మురళి. అది తీసుకుని గబగబ ఆమె నడుస్తున్న వైపు కదిలాడు. "ఏమండోయ్! మీ పర్స్ మర్చిపోయారు!"

చటుక్కున వెనక్కి తిరిగి చూసిందా అమ్మాయి.

"ఓ! థ్యాంక్యు వెరీమచ్ మిస్టర్..!" మృదుమధురస్వరాన అన్నదాఅమ్మాయి పర్సు నందుకుంటూ. "మురళి!" అన్నాడు మురళి ఆమె తనపేరు అడిగినట్టు. "మీరు తీసుకువచ్చి ఇచ్చారు గనుక సరిపోయింది. ఇవాళ అందుకున్న జీతమంతా ఇందులోనే ఉంది చూడండి మిస్టర్ మురళీ!" హాండ్‌బ్యాగ్ జీప్‌లాగి చూపింది ఆమె. నిండా ఉన్న నోట్లను. "జాబ్ చేస్తున్నారా!" కుతూహలంగా చూస్తూ అడిగాడు మురళి. "అవునండీ! ఇంట్లో ఉంటే ఏమీ తోచడంలేదని డాడీ దగ్గర పోరుపెట్టి గర్ల్స్ స్కూల్లో టీచర్‌గా చేరాను. అఫ్‌కోర్స్ టెంపరరీ జాబే అనుకోండి. ట్రయిన్డ్ టీచర్ వచ్చేదాక నాకీ పోస్ట్ ఇచ్చారు." పరిచితునితో మాట్లాడినట్టు మాట్లాడేస్తున్న ఆమె ధోరణి మురళికి నచ్చింది. "నేను ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను. ప్రస్తుతం వరకు ఒంటరిగాడిని అంటే ఐమీన్ బాచిలర్‌ను. బై దిబై మే ఐ నో యువర్ నేమ్!" మురళి కూడా చొరవగా తనకుతాను పరిచయం చేసుకుని ధైర్యంగా ఆమె పేరడిగాడు. "బై ఆల్‌మీన్స్. నా పేరు సుజాత. మా ఇల్లిక్కడికి దగ్గరే మీకు వీలయినప్పుడు ఒకసారి రండి. డాడీకి పరిచయం చేస్తాను." మెత్తగా నవ్వుతూ అన్నది సుజాత. ఆవిడను ఇంటివరకూ దిగబెట్టి రూమ్‌కి చేరుకున్నాడు మురళి. అలా జరిగిన పరిచయం క్రమంగా వృద్ధిచెంది ఒకర్నొకరు ఏకవచనంతో సంభోదించుకునేదాక వచ్చింది. ఇరువురి మనసులలోను ఒకరంటే ఒకరికి విపరీతమైన ఆరాధన ఉంది, అయినా ఇంతదాకా ఎన్నడూ 'ఐ లవ్‌యూ సుజా!' అని గానీ 'లెట్ యు మేరీమీ సుజాతా?' అని గానీ చెప్పలేదు. అడుగలేదు మురళి ఆమెను. సుజాతకూడ అతని ఎడల తనకుగల ఇష్టాన్ని మనసులోనే దాచుకుంది. విచిత్రమేమిటంటే ఆ ఇద్దరికీ తెలుసు తాము ఒకర్నొకరు అభిమానించుకుంటున్నామని, అయితే ఆ అభిమానాన్ని ప్రేమగా నిర్వచించు కోవడానికి ఇంకా ఒకర్నొకరు ఇంకా అర్థంచేసుకోవాలన్న భావం ఇద్దరిలోనూ ఉన్నది.

ఆలోచనలలో తేలిపోతున్న మురళి దూరాన గులాబిరంగు టెర్లిన్ చీర కనిపించగానే ఉత్సాహంగా లేచి ముందుకు నడిచాడు. "అరె! సుజాతేనా వస్తూంది! ఆమె ప్రక్కన ఉన్నతను ఎవరూ? ఏదో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వస్తున్నారు. ఎవరో జంటకాదుకద?" సందేహంగా చూస్తున్న మురళి అనుమానాన్ని పటా పంచలు చేస్తూ దగ్గరికి వచ్చి పలుకరించింది సుజాత. "సారీ మురళీ, లేట్ చేసాను కదూ? చాలసేపటి నుండి వెయిట్ చేస్తున్నావా నాకోసం?" సుజాత పక్కనున్న యువకుడివంక పరీక్షగా చూస్తున్న మురళి కొంచెం అనీజీగా కదిలి ఆ! అరగంటయింది నేను వచ్చి!" అన్నాడు. "ఓ ఇంట్రడ్యూస్ చేయలేదు కదూ ఇతన్ని నీకు, హి ఈజ్‌మై బ్రదరిన్లా మిస్టర్ క్రిష్ణమూర్తి ఎమ్.ఏ.," స్వచ్ఛంగా నవ్వుతూ, మురళికి పరిచయం చేసింది బావను. "మూర్తీ! మీట్‌మై ఫ్రెండ్ మురళి లెక్చరర్ ఇన్ ఇంజనీరింగ్ కాలేజి!" అంది కృష్ణమూర్తితో. "గ్లాడ్ టు మీట్ యు" అంటూ చెయ్యి చాపాడు కృష్ణమూర్తి నిజానికి అతన్ని కలుసుకొనడం ఏమంత పెద్ద

సంతోషంగా అనిపించలేదు మురళికి. అయినా పైకి చిరునవ్వు చిందిస్తూ "ఐ యామ్ గ్లాడ్ టు మీట్ యు" అంటూ కరస్పర్శ చేశాడు. "కూర్చుందాం బాబూ! నాకు కాళ్ళు నొప్పెడుతున్నాయి!" గారంగా అంటూ ఇసుకలో చతికిల పడింది సుజాత. ఆమెకు అటూ ఇటూ కూర్చున్నారు మురళీ, క్రిష్ణమూర్తి, "ఇదిగో ఈ మహానుభావుడు పొద్దున్న ఊడిపడ్డాడు. ఇక వచ్చినప్పటినుండి ఊర్లో తిరగడమే పనయిపోయింది. స్కూలుకు సెలవు రాయించి మరీ తిప్పి చంపాడు" ఫిర్యాదు చేస్తున్నట్టు మురళితో చెప్పింది సుజాత. సుజాతకు తగుల్తున్నట్లుగా కూర్చున్న కృష్ణమూర్తిని చూస్తుంటే కంపరమెత్తుతోంది. అటువంటి సమయంలో సుజాత అన్న మాటలు విన్న మురళి మొహంలో రంగులు మారిపోయాయి. దూరంగా ఉన్నంతవరకు 'మా ఊరికి రావు ఒక్కసారి రారాదా?' అంటూ ఉత్తరాలమీద ఉత్తరాలు రాసి చంపింది. తీరా వచ్చాక ఇదీవరస!" కృష్ణమూర్తి చిన్నగా నవ్వి అన్నాడు. కుత కుతలాడిపోయింది మురళి హృదయం 'ఓహ్! ఏం అన్యోన్యత ఈ బావా మరదళ్ళిద్దరిమధ్యా!' అనుకున్నాడు మనసులో కోపంగా, "చాల్లే! నీకోసం అంత తపించిపోవడంలేదు నేనిక్కడ. నువ్వే 'సుజా నిన్ను చూడాలనిపిస్తుంది. కాసిన్ని రోజులు సరదాగా నీతో గడపాలని ఉంది' అని పదే పదే రాసి పిలవకుండానే పరిగెత్తి వచ్చావు" చిరుకోపంగా చూస్తూ అంది సుజాత. "అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారమ్మాయ్!" కొంటెగా నవ్వి సుజాత నెత్తిమీద చిన్నగా మొట్టాడు కృష్ణమూర్తి "అదిగో! అదే వద్దంటా. నీ మొట్టికాయలు తినీ తినీ నా తల వాచిపోయింది!" అతని చేతిమీద అల్లరిగా కొట్టింది సుజాత. మురళికి ముళ్ళకంప మీద కూర్చున్నట్టుంది. ఎంత దాచుకోవాలన్నా దాగకుండా అతని మొహంలో స్పష్టంగా కనబడి పోతూంది అసూయ. ఒక క్షణంలో అతని మనోగత భావాన్ని చదివేసింది సుజాత. అంతలో చటుక్కున లేచి నిలబడుతూ "నేను వెడతాను సుజాతా, పనుంది." అంటూ మర్యాదకైనా కృష్ణమూర్తితో చెప్పకుండా చక చక నడుస్తూ వెళ్ళిపోయాడు మురళి. "అదేం! ఉన్నట్టుండి అలా వెళ్ళిపోయాడు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కృష్ణమూర్తి. అతని ప్రవర్తన చూసి గాయపడిన హృదయంతో వికల మనస్కురాలై కూర్చుండిపోయిన సుజాత "ఏమో! పనుందన్నాడుగా!" అంది తల్తెతకుండానే. ఆమె స్వరంలో వినబడిన బాధా భావానికి చకితుడయ్యాడు కృష్ణమూర్తి. అయిదు నిమిషాలు గడవక ముందే "పద! బావా పోదాం! నాకిక్కడ బావులేదు." అంటూ లేచిన సుజాత వైపు విస్మయంగా చూసి మౌనంగానే అనుసరించాడు కృష్ణమూర్తి.

రూముకు వెళ్ళాడన్న మాటేగానీ మురళికి మనసు మనసులో లేదు. హృదయమంతా వ్యాపించిన అసూయాగ్ని అతడిని దహించుతూంది. క్షణ క్షణం అతని కళ్ళముందు పక్కపక్కగా కూర్చుని సరదాగా నవ్వుకుంటున్న కృష్ణమూర్తి, సుజాతల రూపాలే మెదులుతున్నాయి. 'ఒకరికోసం ఒకరు తపించిపోతారన్న విషయం వాళ్ళమాటల్లోనే వెల్లడయింది. ఇన్నాళ్ళు తన మనసుతో ఆడుకుందన్నమాట సుజాత. ఇంకా నయం ఆమెను అడిగేయలేదు పెళ్ళి సంగతి. అవమానం జరిగివుండేది.' విపరీతమయిన ఆలోచనలు అతడిని పిచ్చివాడిగా చేస్తున్నాయి. సిగరెట్ పీకలు ఆ ఒక్కరాత్రిలో గుట్టలా చేరాయి. రాత్రంతా నిద్రపట్టక అవస్థ పడ్డాడు మురళి ఇదే ఆలోచనలతో పొద్దున లేచేసరికి కళ్ళు ఎఱ్ఱబడి ముఖం పీక్కుపోయి జ్వరపడిన వాడిలా తయారయ్యాడు.

సాయంత్రం బీచి వైపుకు వెళ్ళనే లేదతనారోజు. అటు దృష్టిపోకుండా ఉండటానికి సినిమాకు బయలు దేరాడు. అతను టికెట్ తీసుకుని హాల్లోకి వెళ్ళేసరికి పిక్చర్ బిగిన్ చేసేసారు చీకట్లోనే వెళ్ళి వెనకాల వరసలో కూర్చున్నాడు. రావడంమైతే వచ్చాడుగానీ, అతని ఆలోచనలు మాత్రం సుజాత చుట్టూనే తిరుగుతున్నాయి మురళికి ముందువైపున ఛైర్స్‌లో కూర్చున్న జంట పిక్చర్ జరుగుతున్నంత సేపూ ఏదో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూనే ఉన్నారు. వాళ్ళను చూస్తుంటే ఏదోలా అనిపించింది మురళికి. ఇంట్రవెల్‌లో లైట్లు వెలిగాయి. పరీక్షగా ముందుకూర్చున్న వాళ్ళవైపు చూసిన మురళి ఉలికిపడ్డాడు. అదే క్షణాన వెనక్కి ఎందుకో తిరిగిచూసిన సుజాత మురళి ముఖభావాలు చూసి అంతకన్న ఉలికిపడింది. ఏదో అనడానికి మాట్లాడ్డానికి నోరు తెరవబోతుండగానే చివుక్కున లేచి బయటకు విసురుగా వెళ్ళిపోయాడు మురళి. సుజాత నిర్విణ్ణురాలయిపోయింది "ఏమిటి సుజా? ఎవరు? అనడిగాడు క్రిష్ణమూర్తి. ఒక్కక్షణంలో తమాయించుకుంటూ "ఎవరో తెల్సినవాళ్ళలా కనబడితే చూసాను, అంతే!" అంది సుజాత. తర్వాత జరిగిన సినిమా సుజాత చూడనేలేదన్న సంగతి పాపం కృష్ణమూర్తికేంతెల్సు?

"ఎలావుంది సుజా పిక్చర్?" వచ్చేస్తుండగా దార్లో అడిగాడు క్రిష్ణమూర్తి "నాకు తలనొప్పిగా ఉంది బావా! త్వరగా పోదాం!" అంది సుజాత నిరుత్సాహంగా, "నేను రావడమే తల నొప్పిలా ఉందేనీకు" రేపు వెళ్ళిపోతానుగా! హాయిగా ఉందువుగాన్లే!" నిష్ఠూరంగా అన్నాడతను. "ఛ! అలా మాట్లాడతావేంటి బావా! నాకీరోజు మనసు బావులేదు ఎంచేతో!" బాధపడుతూ అన్నది. ఇక తర్వాత ఏం మాట్లాడుకోకుండానే మౌనంగా నడిచి ఇల్లు చేరుకున్నారు ఇద్దరూ.

మర్నాడు క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాడు. అతన్ని రైలెక్కించి అటునుండి తిన్నగా బీచ్‌వైపు దారితీసింది సుజాత. కానీ ఏడుగంటలవరకు ఎదురు చూసినా మురళి జాడలేదు. అంతవరకు సహనం వహించిన ఆమెలో ఇక ఓర్పు సన్నగిల్లింది 'మరీ ఇంత అనుమానం మనిషా మురళి! ఒక మగవాడితో చనువుగా ఉన్నంత మాత్రాన ఇంత అసూయా! ఏం పురుషులు!' అనుకున్న ఆమె మనసు విరిగిపోయింది.

సినిమాహాల్లో కృష్ణమూర్తినీ సుజాతనూ చూసాక మరింత అసూయ రేగింది మురళిలో. అందుకే మనసు సుజాతను చూడలని కోరుతున్నా ఆమెను కలుసుకోకుండా ఉండిపోయాడు మూడు రోజులవరకూ, నాలుగోరోజున ఒక ఉత్తరం వచ్చిందతనికి. సుజాత రాసింది!

"మురళి!

మీతో కొంచెం మాట్లాడాలి శ్రమనుకోక ఈ రోజు సాయంత్రం బీచికి రాగలరా!

కృతజ్ఞతలతో,

సుజాత."

అంతే అందులో ఉన్నది సుజాత అతన్ని మీరు అని సంబోధించినదంటే ఆమెకు చాలా కోపం వచ్చిందన్నమాట. "వస్తేరానీ! నేను వెళ్ళను!" కసిగా అనుకున్నాడు మురళి. కానీ సాయంత్రం కాగానే మనసు నిలువనీయలేదతడిని. వెళ్ళకూడదనుకుంటూనే డ్రెస్ చేసుకుని బయలుదేరాడు.

అన్నటైముకు కాస్త ముందుగానే వచ్చి కూర్చుని ఉంది సుజాత. గాలికి రేగి ముందుకు పడుతున్న ముంగురలను వెనక్కి నెట్టుకుంటూ, రెప రెపలాడుతున్న పైటను అదుపులో పెట్టుకుంటూ మాటి మాటికి అతను వస్తున్నాడా అని చూస్తున్నదామె. ఇంతలో రానేవచ్చాడు మురళి. అతని ముఖం గంభీరంగా ఉంది. అడుగులు నిదానంగా పడుతున్నాయి. అంతకన్న సీరియస్‌గా మొహం మార్చుకుని "గుడీవినింగ్" అంది సుజాత సూటిగా అతనివైపు చూడకుండానే "గుడీవినింగ్" అంటీ ముట్టనట్టు అని ఆమెకు కాస్త దూరంగా కూర్చున్నాడు మురళి.

"ఆరోజు ఉన్నట్టుండి అలా లేచి వెళ్ళిపోయారేం?" సూటిగా ప్రశ్నించింది సుజాత. "పనుందని చెప్పాగా!" ముభావంగా ఉంది జవాబు. పెదవి కొరుక్కుంది సుజాత. "మొన్న సినిమాలో చూసికూడా మాట్లాడకుండా వెళ్ళిపోవడానికి కారణ మేమిటో?" వ్యంగ్యంగా వినిపించింది ప్రశ్న మురళికి. అంతలో మళ్ళీ సుజాతే అన్నది "ఈ నాలుగు రోజుల్నుండి నన్ను కలుసుకోవడం మానేయడం కూడా పని ఉండడం వల్లనేనా?" మురళి ముఖం కోపంతో ఎరుపెక్కింది "క్రాస్ ఎగ్జామిన్ చేసి సంజాయిషీ అడగడానికా నన్ను పిలిచింది? మీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేనందుకు క్షమించండి?" వ్యంగ్యాన్ని మిళితంచేసి తిరస్కారంగా అన్నాడు.

ఆవేశంతో సుజాత పెదవులదరసాగాయి కందిపోయిన ముఖం పైకెత్తి తిన్నగా అతనివైపు చూస్తూ "నేను చెప్తా వినండి. మా బావతో కాస్త చనువుగా ఉండడం చూసి ఓర్చుకోలేకపోయారు. అసూయతో వెళ్ళిపోయారారోజు. మొన్న థియేటర్లోనూ బావ నా పక్కన కనపడడంతో మీ జెలసీకి పట్టపగ్గాలు లేకుండా పోయాయి మాట్లాడిస్తానేమో, బయటపడి పోతారేమోనని వెళ్ళిపోయారు. బావతో సరదాగా చనువుగా వున్నానుగా ఇంకేం కావలసినన్ని ఊహలు కల్పించుకున్నారు. అందుకే నాల్గు రోజులనుండి మొహం చాటు చేసారు!" ఉద్రేకంగా అన్నది.

"ఊహించడం బాగానే వుంది. కానీ మీకు అంత ప్రియమైన బావ పక్కన ఉన్నప్పుడు ఇన్నాళ్లు నాతో ఎందుకు స్నేహం చేసారు? నా మనసుతో ఎందుకు ఆటలాడారు? నన్ను రెచ్చగొట్టడానికే కదూ నా ముందు అంతలా ప్రవర్తించింది? మీ ప్రవర్తన చూసాక ఊహలెందుకిక, స్పష్టంగా విషయం కనబడి పోతుంటే" మురళి స్వరం చాలా కఠినంగా ఉంది.

"ఇక ఆపండి! చాలు. మీరింత సంకుచిత హృదయులని గ్రహించలేకపోయాను. ఒక ఆడది మగవాడితో చనువుగా ఉన్నదీ అంటే ఇక ఒకటే అర్థం! అంతేనా? (ఈ నెలరోజుల మన పరిచయంలో మిమ్మల్ని చాలవరకు అర్థంచేసుకున్నాననుకున్నాను. కాని నాదంతా భ్రమ అని తేలిపోయింది బావతో నా ప్రవర్తనను విమర్శించారు. మీ కెప్పుడయినా అంత చనువు ఇచ్చానా? బావ మాతో చిన్నప్పటినుండి కలిసి పెరిగాడు ఎన్నోసార్లు తిట్టుకున్నాం కొట్టుకున్నాం కలిసి ఆడుకున్నాము. ఆతను మా పెదనాన్న కూతుర్నే పెళ్ళి చేసుకోవడంతో మా స్నేహానికింత వరకు ఆటంకం కలగలేదు. తెలిసీ తెలియని వయసులో ఎంత చనువుగా ఉన్నామో ఇప్పుడూ అలాగే ఉంటున్నాము. అతని పక్కన నేను ఒక అన్నపక్కన చెల్లెలిలాగానే ఫీల్ అవుతుతాను." కోపం స్థానాన్ని దుఃఖం ఆక్రమించగా జీరపోతున్న గొంతుతో అంది సుజాత. తన చేతిలో ఉన్న ఫోటోలు తీసి చూపింది మురళికి. ఒకటి కృష్ణమూర్తి పెళ్ళిఫోటో, ఇంక రెండు చిన్నప్పుడు సుజాత కృష్ణమూర్తి కలిసి ఉన్న ఫోటోలు.

వాటిని చూసి తర్వాత మురళీ ముఖం అవమానంతో మలినమయింది. సుజాత గురించి ఏదేదో ఊహించినందుకు ఆమె నిష్కల్మషతను అనుమానించినందుకు కించపడ్డాడు. పది నిమిషాలు మౌనం రాజ్యం చేసింది. వారిరువురి నడుమా. కాసేపటి తర్వాత చిన్నబోయిన ముఖాన్ని పైకెత్తి, "నన్ను క్షమించు సుజా! ఆవేశంలో ఏవేవో ఊహించి నిన్ను నొప్పించాను. ఇంకెప్పుడూ ఇలాటి అనుమానాలు మన మధ్య రానివ్వను." అన్నాడు మెల్లిగా.

సుజాత ఒక క్షణంపాటు పరీక్షగా అతన్ని చూసింది. ఆమె కనులలో ఏదో నిశ్చయం మెదిలింది. "నన్ను క్షమించు మురళీ! అయినా చెప్పక తప్పదు మరి. మన స్నేహాన్ని ఇంతకన్న పొడిగించవద్దు. స్నేహితులం స్నేహితులుగానే మిగిలిపోదాం. సంకుచితంగా ఆలోచించడం నాకు సరిపోదు మురళీ! మనిద్దరివీ భిన్నతత్వాలు. అందుకనే ఇక్కడే ఆగిపోనీ మన పరిచయాన్ని. అయితే ఎప్పుడయినా కలుసుకోవడం తటస్థపడితే మొన్నట్లా పలకరించకుండా పోవద్దని, నన్ను నీ స్నేహితురాలుగా గుర్తుంచుకోమని నా ప్రార్థన." నిదానంగా చెప్పి వెళ్ళడానికి లేచింది సుజాత. "సుజా" ఏదో చెప్పబోతున్న మురళిని వారిస్తూ "గుడ్‌బై మై ఫ్రెండ్!" అంటూ ముందుకు కదిలింది సుజాత. నిశ్చేష్టుడై చూస్తూ నిలబడిపోయాడు మురళి.

"జయశ్రీ" మాస పత్రిక

తేది : ఏప్రిల్, 1968.